విద్యార్థిని మృతిపై ఆరా

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని జాంగుడ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో గురువారం సిపిఎం మండల నాయకులు, గసభ పంచాయితీ మాజీ సర్పంచ్ టి.సురేష్ కుమార్, వార్డు మెంబర్ పి సత్యనారాయణ గురువారం ఆ పాఠశాలలో సందర్శించారు. విద్యార్థిని మృతికి గల కారణాలపై పాఠశాల ఉపాధ్యాయులను, సిబ్బందిని, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పద్దు నయోమి విద్యార్థిని ఇటీవల పాఠశాలలో ఉంటూ తమ స్వగ్రామానికి గసభ వెళ్లి అకస్మాత్తుగా మృతి చెందిన సంఘటన తెలిసిందే. దీంతో పలు అనుమానాలు వ్యక్తం కావడంతో స్థానిక సిపిఎం పార్టీ నాయకులు ఆ పాఠశాలను సందర్శించి మృతికి గల కారణాలపై ఆరా తీశారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న నేతలు

ఏకధాటిగా వర్షాలు

జల దిగ్బంధంలో గ్రామాలు

కర్లపాదోర్ వద్ద ప్రవహిస్తున్న నీరు

-పొంగి ప్రవహిస్తున్న వాగులు, గెడ్డలు

-గిరిజన గ్రామాలకు నిలిచిన రాకపోకలు

-వంతెనల నిర్మాణాలను పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: **అల్లూరి జిల్లాలో వదలని వానతో గిరిజన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మన్యాన్ని గురువారం కూడా వర్షం వదల్లేదు. మంగళవారం నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు భారీ వర్షం కొనసాగి..గురువారం ఉదయం కూడా భారీ వర్షం కురిసింది. ఏజెన్సీలోని అన్ని మండలాల్లోనూ గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.**

ఏజెన్సీలోని అన్ని ప్రధాన గెడ్డలు, వాగులలో వరద ఉధృతి నెలకొంది. మారుమూల ప్రాంతాల్లో గెడ్డలు, వాగులన్ని ప్రవహిస్తుండడంతో సమీప గ్రామాల గిరిజనులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. గెడ్డలను దాటి ప్రయాణం చేసేందుకు గిరిజనులు అవస్థలు పడుతున్నారు.

ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల్లో కొండ వాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు, డుంబ్రిగూడ, చింతపల్లి మండలాల్లోని ప్రధాన గెడ్డలు ప్రమాదకరంగా ప్రవహిస్తుండటంతో మారుమూల గ్రామాలకు రవాణా సంబంధాలు నిలిచి పోయాయి. పాఠశాలలకు వెళ్లే ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది ప్రమాదకరంగా గెడ్డలు దాటాల్సి వస్తోంది. జిల్లా వ్యాప్తంగా మంగళవారం 269.2. మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా బుధవారం 697 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. మంగళవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి జి.మాడుగుల మండలం మారుమూల కిల్లంకోట పంచాయతీ కప్పలు గ్రామ సమీపంలో కోడిమామిడి గెడ్డ ఉప్పొంగింది. గ్రామానికి చెందిన ఆరుగురు మంగళవారం ఉదయం పశువులను మేపడానికి సమీప కొండకు వెళ్లి తిరిగి రాలేని పరిస్థితి నెలకొంది. పశువులతో గ్రామానికి చేరుకోవడానికి కోడిమామిడి గెడ్డను దాటాల్సి ఉంది. గెడ్డ ఉప్పొంగడంతో గెడ్డ దాటడానికి సాధ్యం కాక మంగళవారం రాత్రంతా పశువులతోపాటు అడవిలోనే ఉండిపోయారు.

పెదబయలు మండలంలో గిన్నెలకోట, ఇంజరి, జామిగూడ, గుల్లెలు పంచాయతీలకు వెళ్లే గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. గిరిజనులు గెడ్డలు దాటేందుకు ప్రయత్నించవద్దని, వర్షాల నేపధ్యంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ముంచింగిపుట్టు మండలంలో లక్ష్మీపురం పంచాయతీలోని తుమిడిపుట్టులో బాలిక అనారోగ్యంతో మృతి చెందింది. బాలిక మృతదేహాన్ని శ్మశాన వాటికకు తరలించేందుకు రెండు రోజుల పాటు ఇంట్లోనే ఉంచుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.ప్రవాహం తగ్గడంతో మృతదేహాన్ని గెడ్డను దాటించి దహన సంస్కారాలు నిర్వహించారు. అలాగే కర్లపొదార్, లక్ష్మీపురం గ్రామ సమీపంలోని గెడ్డలు ఉప్పొంగి వంతెన పైనుంచి ప్రవహిస్తున్నాయి. ముంతగుమ్మి, తుమిడిపుట్టు, బిరిగూడ గెడ్డల ఉధృతితో బుంగాపుట్టు, లక్ష్మీపురం పంచాయతీలకు చెందిన సుమారు 18 గ్రామాలకు రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. కరిముఖిపుట్టు వద్ద కల్వర్టుపై నుంచి నీరు ప్రవహించడంతో కుమడ, బూసిపుట్టు, కొరవంగి బాబుసాల ప్రాంతాలకు రాకపోకలు స్తంభించాయి.

డుంబ్రిగూడ మండలం కించుమండ పంచాయతీ శివనగరం, పోతంగి పంచాయతీ సంపపెట్టి వంతెనలపై నుంచి వర్షపు నీరు ప్రవహిస్తుం డటంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. హుకుంపేట మండలంలోని చీడిపుట్టు, సంతారి గెడ్డలతో పాటు మత్స్యగెడ్డ ఉధతంగా ప్రవహిస్తోంది. చీడిపుట్టు వంతెన పైనుంచి గెడ్డ ప్రవహించడంతో బారపల్లి, అడ్డుమండ తదితర గ్రామాల నుంచి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.జికె వీధి మండలం రింతాడ పంచాయతీ పరిధిలోని చాపగెడ్డ కుమ్మరివీది విద్యార్థినీ, విద్యార్థులు కిలోమీటరు దూరంలోని చాపగెడ్డ పాఠశాలకు వెళ్తున్నారు. వర్షాకాలంలో కాలువ, బురద దారిలో వారి బాధలు వర్ణనాతీతం. ఎప్పుడు ఏం జరుగుతుందో నన్న భయంతో బురద దారి ఆపై కాలువ దాటి రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి.జి.మాడుగుల నుంచి పాడేరు, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల వరకు విస్తరించి ఉన్న ప్రధాన మత్స్యగెడ్డలో నీటి ప్రవాహం అధికమైంది. పాడేరు మండలం బొక్కెళు సమీపంలోని రాయిగెడ్డ కాజ్ వే లో నీటి ప్రవాహం జోరందుకుంది. బుంగ గెడ్డ చిలకలమామిడి గెడ్డ, మత్స్యగెడ్డల్లో, పంట పొలాల్లో వర్షపు నీరు అధికంగా వచ్చి చేరింది. మండల కేంద్రాల్లో ఆయా ప్రదేశాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం వల్ల చిన్న వ్యాపారులు, ప్లాట్ ఫామ్ వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షంతో ఇంటర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులు వసతి గృహాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. మండల కేంద్రాలలో జనసంచారం తక్కువైంది. వర్షాలతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. అనంతగిరి, పాడేరు, లంబసింగి, ధారకొండ, మారెడుమిల్లి, మోతుగూడెం ఘాట్ ప్రాంతాల్లోను భారీ వర్షాలు కురుస్తుండడంతో వాహనాల ప్రయాణానికి ఆలస్యమవుతుంది.

కొట్టుకు పోయిన కల్వర్టు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ సంగంవలస గ్రామంలో కల్వర్టు వర్షాలకు కొట్టుకు పోయిందని సర్పంచ్ కొర్ర త్రినాథ్ తెలిపారు. కల్వర్టు, రోడ్డు మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని త్రినాథ్ డిమాండ్ చేశారు, ఆయన మాట్లాడుతూ.అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ , ఉమ్మడి జిల్లాల జడ్పీ చైర్ పర్సన్ సుభద్ర, అల్లూరి జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ప్రోజెక్ట్ అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మూడు సంవత్సరం క్రితం నిర్మించిన కల్వర్టు కొట్టు కోపోయిందన్నారు. గెడ్డ అవతల పాఠశాల ఉండటంతో విద్యార్దులు గెడ్డ దాటలేక మూడు రోజుల పాటు పాఠశాలకు వెళ్లలేదన్నారు.. ఈ విషయం పై గతంలో అనేక సార్లు స్పందనలో వినతి పత్రాలు అందజేసినా స్పందించలేదన్నారు. ఈ కార్యక్రమంలో సంగంవలస వార్డు సభ్యుడు ఎ.అనంతరం, గ్రామస్థులు ఏ.మహేష్, కే.నాగరాజు తదితులు పాల్గొన్నారు.

కల్వర్టు కొట్టుకుపోవడంతో నిలిచిన రాకపోకలు

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా అక్టోబర్ 15న బహిరంగ సభ

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వర్లు

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, చిత్రంలో కిరణ్, రామారావు తదితరులు

ప్రజాశక్తి-రంపచోడవరం

వైసిపి ప్రభుత్వ పాలనలో రాష్ట్ర అభివృద్ధి శూన్యమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో గురువారం పార్టీ ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు అధ్యక్షతన జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వం వచ్చి నాలుగున్నరేళ్లు పూర్తవుతున్నా, స్థానిక ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధికి ఒక రూపాయి కూడా తేలేదని, రోడ్లు, మంచినీటి సౌకర్యాలు కల్పించలేదని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపించింది ఈ ప్రాంతంలో ఉన్న సంపదను కొల్లగొట్టడానికా? అని ప్రశ్నించారు. పైగా గిరిజనులకు నష్టం కల్గించే విధంగా బోయ, వాల్మీకిలను ఎస్టి జాబితాలో చేర్చడం, దీనిపై వైసిపి ఎంపీ విజయ సాయి రెడ్డి పార్లమెంట్లో మాట్లాడటం దారుణమన్నారు. ఈ ప్రాంత ప్రయోజనాల కోసం ఉన్నారా? లేదంటే ఏజెన్సీ పేరు చెప్పుకొని దోచుకోవడానికి ఉన్నారా? ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, గుంతలు కారణంగా రోజూ ఏదో ఒక ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఆసుపత్రుల్లో వైద్యులు లేరని, మందులు లేవని, పాము కాటు గురై వస్తే మందులు అందించలేని పరిస్థితుల్లో ఈ ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో మంచినీరు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాల్లేవన్నారు. కూనవరంలో సిపిఎం సమావేశం నిర్వహిస్తుంటే ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ పోలీసులను ఉసిగొలిపి ఆ సమావేశాన్ని ఆపేందుకు ప్రయత్నించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్సీకి దమ్ము ధైర్యం ఉంటే ప్రత్యక్షంగా ఎదుర్కోవాలని, తాము తప్పు చేస్తే ప్రశ్నించాలని, అంతేగాని నియోజకవర్గంలో వైసిపి తప్ప మరో పార్టీ లేదని విర్రవీగితే మిమ్మల్ని నేలకు దించే శక్తి సామర్థ్యాలు ఎర్రజెండాకు ఉన్నాయని హెచ్చరించారు. వైసీపీ ఈ ప్రాంతాన్ని పక్కన పెట్టిందని, టిడిపి పట్టించుకోవడం లేదని, జనసేన పవన్ కళ్యాణ్ ఈ ప్రాంతానికి రావడం లేదని పేర్కొన్నారు. సిపిఎం గెలిచినా, ఓడినా ఈ ప్రాంతం అభివృద్ధి కోసం, ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజల మధ్య ఉండి పోరాటం చేస్తుందని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు, బిజెపి రాష్ట్రానికి చేసిన ద్రోహానికి వ్యతిరేకంగా అక్టోబర్ 15న రంపచోడవరంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, ఇందులో ప్రజలు వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, పార్టీ నాయకులు కె.సూరిబాబు, రామరాజు, కె చల్లయ్యమ్మ, సత్తన్న తదితరులు పాల్గొన్నారు.

గొల్లగూడెంలో పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి- విఆర్.పురం

మండలంలోని రేఖపల్లి పంచాయతీ గొల్లగూడెం గ్రామంలో గొర్రెలు, మేకలు, పశువులు వింత వ్యాధితో మృత్యువాత పడుతున్న వైనంపై ప్రజాశక్తి ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించారు. ఈ మేరకు గొల్లగూడెంలో గురువారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. దీనిని స్థానిక సర్పంచ్ పూనెం సరోజిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవాల పెంపకందారులు ఈ వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని, వైద్యులు చెప్పే సూచనలు తప్పకుండా పాటించాలని కోరారు. పశువైద్యాధికారి డాక్టర్ మినప రాజేశ్వరి మాట్లాడుతూ పశువులు, గొర్రెలు, మేకలకు దాణా మంచిగా ఇవ్వాలని, ఇచ్చిన మందులను చెప్పిన మోతాదులో సక్రమంగా వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, పంకు సత్తిబాబు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు మందులు అందజేస్తున్న సర్పంచ్ సరోజిని, పశు వైద్య సిబ్బంది

గిరిజన గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

ఎఎస్పి జగదీశ్ ఆడాహళ్లి

ప్రజాశక్తి -రాజవొమ్మంగి

గిరిజన గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని రంపచోడవరం ఎఎస్పి జగదీష్ ఆదాహళ్లి తెలిపారు. మండలంలోని బడదనాంపల్లి పంచాయతీ రాజుపేట గ్రామంలో పోలీసులు ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్పి మాట్లాడుతూ రాజుపేట గ్రామ సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, వాటిని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని చెప్పారు. గ్రామంలో చదువుకున్న యువకులు, వారికున్న ఆసక్తికి సంబంధించిన వివరాలు స్థానిక సిఐ బాజీలాల్‌కు ఇస్తే, కాంపిటేటివ్ ఎగ్జామ్స్ ప్రిపేర్ నిమిత్తం కోచింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. బడదనాంపల్లి నుండి రాజుపేట వరకు రహదారి సరిగా లేదని, పెద్ద పెద్ద గోతులతో ఉందని, దీంతో తమ గ్రామానికి ఉపాధ్యాయుడు రావాలన్నా, తాము నిత్యవసర సరుకులు తెచ్చుకోవాలన్నా ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు తెలిపారు. ప్రధాన రహదారి నుండి గ్రామానికి చేరుకోవడానికి దుంగలతో నిర్మించిన బ్రిడ్జియే గతని, అది ఏ క్షణాన కూలి పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని, బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామంలో అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని, పక్కా గృహాలు మంజూరు చేయాలని, రేషన్‌కార్డులు, కుల ధ్రువీకరణపత్రాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆరోగ్య సబ్ సెంటర్ ఏర్పాటు చేసి ఎఎన్ఎం, ఆశా కార్యకర్తను నియమించాలని, పెచ్చులూడుతున్న పాఠశాల భవనానికి మరమ్మతులు చేయాలని కోరారు. అనంతరం 45 గిరిజన కుటుంబాలకు బియ్యం, కూరగాయలు, దుప్పట్లు, యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిఐ షేక్ బాజీ లాల్, ఎస్‌హెచ్ఒ గోపి నరేంద్ర ప్రసాద్, జెడ్పిటిసి ఒడుగుల జ్యోతి, ఎంపీపీ వెంకటలక్ష్మి, వైసిపి నాయకులు దాట్ల వెంకటేశ్వరరాజు, ఎస్ఐ రఘునాథరావు, పోలీస్ సిబ్బంది, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు గిరిజనులు పాల్గొన్నారు.

గిరిజనులకు బియ్యం, కూరగాయలు అందిస్తున్న ఎఎస్పి జగదీష్

వినాయక ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి -సీలేరు : జీకే.వీధి మండలం సీలేరు పోలీస్ స్టేషన్ పరిధిలో వినాయక ఉత్సవాల నిర్వహించే నిర్వాహకులు నిబంధనలను తప్పకుండా పాటించాలని స్థానిక ఎస్సై రామకృష్ణ వెల్లడించారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఉత్సవాలు నిర్వహించే కమిటీ మెంబర్లు వారి వివరాలు పోలీస్ స్టేషన్లో పొందుపరచాలని సూచించారు. ప్రైవేటు, పంచాయతీలకు సంబంధించిన స్థలాల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసేవారు వారు ఆయా స్థలాల యజమానుల అనుమతి పొందాలన్నారు. రాకపోకలకు అంతరాయం లేకుండా, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పందిళ్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పందిళ్ళ వద్ద ఇసుక, నీళ్లు అందుబాటులో ఉంచాలన్నారు. నిమజ్జనం, ఊరేగింపులు అనుమతించిన సమయంలో, కేటాయించిన ప్రదేశాలు, మార్గాల్లో మాత్రమే చేయాలని స్పష్టం చేశారు.

నేడు నాలుగు మండలాల్లో విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి- రంపచోడవరం

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా గంగవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి, వై.రామవరం మండలాల్లోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రంపచోడవరం విద్యుత్ శాఖ ఇఇ ఎండి.యూసఫ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరంచాలని ఆయన కోరారు.

మార్త శ్రీరామ్మూర్తికి నివాళి

ప్రజాశక్తి- కూనవరం

అమరజీవి కామ్రేడ్ మార్త శ్రీరామ్మూర్తి వర్ధంతి సందర్భంగా స్థానిక సీపీఎం కార్యాలయం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు శ్రీరామ్మూర్తి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గిరిజనుల సమస్యలపై పోరాటం చేసిన దీశాలి శ్రీరామ్మూర్తి అని కొనియాడారు. ఏజెన్సీ ప్రాంతంలో వెట్టి చాకిరీని రద్దు చేయాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా గిరిజనులను ఒక్కతాటిపై నడిపించిన యోధుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, నాయకులు తాళ్లూరి శ్రీనివాసరావు, యడ్ల వెంకన్నబాబు, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ్మూర్తి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

గణపతి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి : ఎఎస్పి

మాట్లాడుతున్న ఎఎస్పి

ప్రజాశక్తి-పాడేరు: వినాయక చవితి పందిళ్ళు మండపాలు ఏర్పాటుకు అనుమతి తప్పనిసరిగా సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారి నుంచి తీసుకోవాలని పాడేరు అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ధీరజ్ వెల్లడించారు. గురువారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉత్సవాలు నిర్వహించే వారు తప్పనిసరిగా నియమ నిబంధనలను పాటించాలని సూచించారు. వినాయక ఉత్సవాల మండపాలు ఏర్పాటు చేసుకోవడానికి 5 లేదా అంతకంటే ఎక్కువ మంది కమిటీగా ఏర్పడి వారి వివరాలు సంబంధిత పోలీస్ స్టేషన్ లలో తెలిపి, గుర్తింపు కార్డు నకలు కాపీలు సమర్పించి అనుమతి పొందాలన్నారు. ప్రైవేట్ లేదా పంచాయతీ సంబంధించిన స్థలాలలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయదలచిన వారు ముందుగా సదరు ప్రైవేటు స్థలమైతే స్థల యజమాని, ప్రభుత్వ స్థలమైతే పంచాయతీ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. వినాయక పందిళ్ళు, విగ్రహం పెట్టి ప్రదేశం వాహన రాకపోకలకు అంతరాయం కలుగకుండా, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతిష్టించనున్న వినాయక విగ్రహాల ఎత్తు, బరువు, ఉత్సవం నిర్వహించే రోజుల సంఖ్య నిమజ్జనం చేసే తేదీ, సమయం, నిమజ్జన మార్గం, నిమజ్జన ప్రదేశము మరియు విగ్రహ నిమజ్జనానికి ఉపయోగించే వాహన వివరాలను విధిగా సంబంధిత పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని చెప్పారు. ఉత్సవాల నిర్వహణలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా ఉత్సవ కార్యనిర్వాహకులో పూర్తి బాధ్యత వహించవలసి ఉంటుందని. వినాయక విగ్రహం ఏర్పాటు చేసిన నిర్వాహకులు తగిన భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో పాడేరు సర్కిల్ ఇన్స్పెక్టర్ సుధాకర్ పాల్గొన్నారు.

పర్రెడలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి- పెదబయలురూరల్: మండలంలోని పర్రెడ గ్రామంలో జయంతి ట్రస్ట్ అండ్ ఆక్సిజన్ హాస్పిటల్ సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు ఎన్ .విజయకుమార్, సునిల్‌లు 200మంది గిరిజనులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సిఓ వెంకటరమణ, ట్రస్ట్ చైర్మన్ చిట్టిబాబు, కమిటీ సభ్యులు శ్యామల, అరవింద్ కుమార్, స్థానిక సర్పంచ్ చెండా రవిశంకర్ పాల్గొన్నారు.

హాజరైన వైద్యులు, సిబ్బంది

మంజూరు పత్రాన్ని ఇస్తున్న పిఒ

ఇంటి స్థలం మంజూరు

ప్రజాశక్తి-పాడేరు: ఇంటి స్థలం మంజూరు కోసం ఐటిడిఏలో నిర్వహించిన స్పందనలో దివ్యాంగుడు వంటారి చంటిబాబు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటిడిఏ పి ఓ వి.అభిషేక్ అర్జీని స్వీకరించి నివాస స్థలం కేటాయించాలని పాడేరు తహశీల్దార్‌ని ఆదేశించారు. ఈ మేరకు తలారిసింగి గ్రామం లో ఒకటిన్నర సెంట్ల భూమికి కేటాయించి నివాస స్థలాన్ని గురువారం ఐటిడిఏ పిఓ అభిషేక్ ఆయన కార్యాలయంలో నివాశ స్థలం ధృవీకరణ పత్రాన్ని అందజేసారు. ఐటిడిఏ నుండి రూ.20 వేల ఆర్ధిక సహాయాన్ని మంజూరు చేసారు. ఇల్లు నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాడేరు తహశీల్దార్ వంజంగి త్రినాధ రావు, ఆర్ ఐ నల్లన్న తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన

ప్రజాశక్తి హుకుంపేట:-మండలంలోని కొంతిలి పంచాయతీ కొంతిలి గ్రామం లో ఎంపీ నిధులతో 10 లక్షలు రూపాయలు తో కమ్యూనిటీ భవనం నిర్మాణానికి జడ్పీటీసీ రేగం మత్స్యలింగం, కొంతిలి సర్పంచ్ రేగం రమేష్ గురువారం శంకుస్థాపన చేశారు.అనంతరం జడ్పీటీసీ మాట్లాడుతూ, వైస్సార్సీపీ ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు పెద్ద పీట వేస్తుందన్నారు. ఎంపీ నిధులతో హుకుంపేట మండలంలో రూ.7.50లక్షలతో ఐదు బోర్ బావులు, రూ.6.00లక్షలతో సోలార్ లైట్లు ఏర్పాటు చేయడం జరింగిందన్నారు. భారమాసి పంచాయతీ నీలంపూట్టు, కొంతిలి గ్రామాల్లోకి సామాజిక భవనాల నిర్మాణంకు నిధులు మంజూరు చేసారన్నారు. ఈ కార్యక్రమం లో స్థానిక సర్పంచ్ రేగం రమేష్, అరకు వేలిమండలం కొత్తబాల్లుగూడ ఎంపీటీసీ స్వాభి రామూర్తి, సర్పంచ్‌లు వెంకటపూర్ణిమ, సర్పంచ్ చిన్నయ్య పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న జెడ్‌పిటిసి

వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు

గిరిజనులను ఆదుకోవాలి

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా నివాస గృహాలు, పంటలు కోల్పోయిన బాధిత గిరిజనులకు నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ స్థానిక సిపిఎం మండల నాయకులు మాజీ సర్పంచ్ పి.సురేష్ కుమార్, వార్డు మెంబర్ పి.సత్యనారాయణ, వై అచ్యుత్ గురువారం స్థానిక తహసీల్దార్ నాగమ్మకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, వర్షాల కారణంగా మండలంలోని గసభ పంచాయితీ గసభ, లోగిలి, తూటంగి పంచాయతీ లాసేరు గ్రామానికి చెందిన పి దొంబు, పి గురుమూర్తి, కె.బుల్లిరాజులకు చెందిన పెంకు టీళ్ళులు పూర్తిగా ధ్వంసమయ్యాయన్నారు. బాధిత గిరిజనులు నిరుపేదలకు కావడంతో వారు నివాస గృహలు నిర్మించుకోవడానికి చాలా కష్టతరమవుతుందని తక్షణమే ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బాధిత గిరిజనులు పాల్గొన్నారు.

ఆదివాసీ చట్టాలను కాలరాస్తే పోరాటం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: నకిలీ ఎస్‌టి ధ్రువపత్రాల జారీకి ఒత్తిడి చేయడం ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కిందకే వస్తుందని, ఆదివాసి హక్కులు, చట్టాలు కాలరాసే చర్యలకు తిరుగుబాటు తప్పదని ఎపి ఆదివాసి జెఎసి జిల్లా కన్వీనర్ రామారావుదొర, రాష్ట్ర కార్యదర్శి ఎస్.గంగరాజు గురువారం ఉమ్మడి ప్రకటనలో తెలిపారు. ఆదివాసీలకు రక్షణగా ఉన్న చట్టాలు హక్కులను హరించేలా జిల్లా యంత్రాంగం పని చేస్తున్నదని ఆరోపించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒలపై జాతీయ ఎస్ టి కమిషన్ తో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అరకులోయలో బిసి కులానికి చెందిన వ్యక్తికి ఎస్‌టిలుగా ధ్రువీకరించారని ఆరోపించారు. గిరిజనేతరులు నకిలీ ఎస్‌టి సర్టిఫికెట్లు, బినామీ పేర్లతో ఏజెన్సీ భూములను హస్తగతం చేసుకుంటున్నారని తెలిపారు.

శంకరరావుకు సన్మానం

ప్రజాశక్తి- అనంతగిరి: మండలంలోని చిలకగెడ్డ ఎన్ఆర్ రాపురం పంచాయతీ వీఆర్వోగా పని చేస్తూ సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీ అయిన పట్టాసి. శంకర్రావును గురువారం ఎన్ఆర్ పురం పంచాయతీ సచివాలయం సిబ్బంది ఘనంగా సన్మానించారు. అనంతరం సర్పంచ్. బడ్నాయన సన్నమ్మ. మాట్లాడుతూ, విఆర్ఓ అందుబాటులో ఉండి ప్రజల సమస్యలపై నిరంతరం పని చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు రామయ్య, కె.రవి, సెక్రటరీ అర్జున్ పాల్గొన్నారు

విచారణ వేగవంతం చేయాలి

- జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి-అనంతగిరి: మండల పరిధిలో మారుమూల నాన్ షెడ్యూల్ రోంపల్లీ పంచాయతీ బూరుగ, చినకోనేల గ్రామాల్లో అన్యాక్రాంతం అవుతున్న గిరిజనుల భూములపై పెట్టిన ఆర్ఓఆర్ కేసుల జడ్జిమెంట్ వేగవంతం చేయాలని పాడేరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్‌కి విన్నవించామని స్థానిక జడ్పిటిసి దీసరి గంగరాజు పేర్కొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బూరుగ, చినకోనేల గ్రామాలకు చెందిన గిరిజన రైతులు పూర్వకాలం నుండి సుమారు వందల పైగా వ్యవసాయ పంటలు పండిస్తూ జీవన సాగిస్తున్నారని తెలిపారు. కొంతమంది మైదాన ప్రాంతాలకు చెందిన భూ స్వాములు భూములను కాజేశారన్నారు. రైతు భరోసా ఇతర పథకాలు అందక పోవడంతో ఆన్లైన్లో చూడడగా రైతుల పేర్లు లేక పోవడంపై ఈ కేసు సబ్ కలెక్టర్ కోర్టులో కేసు ఉందని తెలిపారు. ఈ కేసును వేగవంతం చేసి భూములు రైతులకు దక్కే విధంగా కృషి చేయాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ సోమ్మెల అప్పలరాజు, కోటపర్తి సింహాచలం, జన్ని శంకర్ రావు గిరిజన సంఘం నాయకుడు నరాజీ సురేష్ పాల్గొన్నారు

పౌష్టికాహార మాసోత్సవంలో పాల్గొన్న ఐసిడిఎస్ అధికారులు, గర్భిణులు, బాలింతలు

పౌష్టికాహారంపై అవగాహన

ప్రజాశక్తి-మోతుగూడెం : అల్లూరి సీతారామరాజు జిల్లా, వై రామవరం మండలం డొంకరాయి అంగన్వాడీ -2 కేంద్రంలో ఐసీడీఎస్ సిడిపిఓ ఆధ్వర్యాన పౌష్టికాహార మాసోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పౌష్టికాహారం గురించి తెలిపారు. గర్భిణులు, బాలింతల్లో ఎక్కువగా రక్త హీనత ఏర్పడుతుందని, మన ప్రాంతంలో పండే కాయగూరలు ఆకుకూరలు శుభ్రంగా వండుకొని తినాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డొంకరయి ఎస్సై శివ కుమార్, జెడ్పీటీసీ కెవి.రమణ, కో ఆప్షన్ సభ్యులు ముక్క రమణ, ఉపసర్పంచు నాగు కున్న, అంగన్వాడీ సూపెరవైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.

'సెవెన్ హిల్స్' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సెవెన్ హిల్స్ ఆసుపత్రి కార్మికుల డిమాండ్లను యాజమాన్యం నెరవేర్చాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హాస్పిటల్స్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు వై.రాజు హెచ్చరించారు. సెవెన్ హిల్స్ ఆసుపత్రి కార్మికుల సర్వసభ్య సమావేశం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో కార్మికులు చేస్తున్న పోరాటానికి అందులో పని చేస్తున్న ఇతర విభాగాల వారి నుంచి మద్దతు లభించిందని చెప్పారు.

రాయపల్లిలో 'పొలం బడి'

ప్రజాశక్తి - అడ్డతీగల : అడ్డతీగల మండలం రాయపల్లి గ్రామంలో మండల వ్యవసాయ అధికారి ఎమ్.సువర్ణ కుమారి ఆధ్వర్యాన పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సువర్ణ కుమారి రైతులకు పంట పొలాల్లో ఆకుల కత్తిరింపు పద్ధతిపై అవగాహన కల్పించారు. అనంతరం వరి పొలాల్లో ఆకుముడత పురుగును గమనించారు. పురుగు ఉధృతి బట్టి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఆకుముడత ఆశించినట్లయితే క్లోరిఫైరీఫాస్ 2.5 ఎంఎల్ లీటర్ నీటికి, ఎసిఫాట్ 1.5గ్రామ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విఎఎ వి.మోనికా, దుర్గా భవాని, రైతులు పాల్గొన్నారు.

వైసిపిలో చేరికలు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని నల్గొండ పంచాయతీ మాజీ సర్పంచ్ బచ్చేల జగదేశ్వరి, టిడిపి నాయకులు బచ్చేల రమణబాబు, జంపా లక్ష్మణరావు, రాజులమ్మ దంపతులు, కొప్పు చిన్నబ్బాయ్ తదితరులు గురువారం వైసిపిలో చేరారు. వారికి పాడేరు శాసనసభ్యులు కొటగుళ్లి భాగ్యలక్ష్మి వైసిపి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. జగన్మోహన్ రెడ్డి విధానాల నచ్చి వైసిపిలో చేరిన వారికి సముచిత స్థానం లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని వివిధ పాఠశాలల్లో హిందీ దివస్ (భాషా దినోత్సవం) గురువారం ఘనంగా నిర్వహించారు. పెదమాకవరం ఆశ్రమ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పధానోపాధ్యాయులు దేవేశ్వరరావు మాట్లాడుతూ హిందీ జాతీయ భాషగానే కాక విశ్వ భాషగా గుర్తింపు పొందిందని తెలిపారు. అనంతరం హిందీ ఉపాధ్యాయులు పనసల శ్రీదేవిని ఘనంగా సత్కరించారు. పాఠశాల విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నకిలీ కుల ధ్రువీకరణ పత్రం జారీపై

సమగ్ర విచారణ జరిపించాలి

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

మాట్లాడుతున్న సురేంద్ర

ప్రజాశక్తి-అరకులోయరూరల్: నకిలీ కుల ధ్రువీకరణ పత్రంపై జిల్లా ఉన్నతాధికారులతో నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. గురువారం అరకువేలి ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సురేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్, నాయకులు జి చిన్న బాబు, కె.రామారావు కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, ఆదివాసి గిరిజన సంఘం ఫిర్యాదు మేరకు అరకువేలి టౌన్ షిప్‌లో గిరిజనేతరుడైన పిట్టల రాంబాబు, ఒడిస్సా రాష్ట్రం చెందిన కోర్ర అక్కులపై లిఖితపూర్వక ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు ముడుపులకు ఆశ పడి నకిలీ పత్రాల ఇస్తున్నారని విమరిశంచారు. గ్రామ సచివాలయం వ్యవస్థ వచ్చిన తర్వాత నకిలీ కుల ధ్రువీకరణ పత్రాల జరీ మరింత పెరిగిందని అన్నారు. నకిలీ ఎస్టి కుల ధ్రువీకరణ పత్రం జారీ చేసిన అరకువేలి మండల తహశీల్దార్‌ను విచారణ అధికారిగా నియమించడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు.ఐటీడీఏ ఉన్నత స్థాయి అధికారుల సీసీల ఒత్తిడితోనే పిట్టల రాంబాబుకు ఎస్టీ నకిలీ కుల ధ్రువీకరణ పత్రం జారీ చేశామని రెవిన్యూ అధికారులు విచారణలో చెప్పారని తెలిపారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని జిల్లా ఉన్నతాధికారులతో విచారణ జరిపించి బాధ్యులపై క్రిమినల్ కేసు నమోదు చేసి నకిలీ ఎస్టి కుల ధ్రువీకరణ పత్రం జారీ చేసిన అరకువేలి తహశీల్దార్, సంబధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నకిలీ ఎస్టి కుల ధ్రువీకరణ పత్రం జారీపై జిల్లా కలెక్టర్ స్పందించి బాధ్యులపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ప్రకటించడం హర్షనియమన్నారు.

నేడు ఐటిడిఎ వద్ద ధర్నా

పాడేరు : అల్లూరి జిల్లా ఆదివాసి ప్రాంతంలో బోగస్ ఎస్టీ ధ్రువీకరణ పత్రాల జారీపై ఈ నెల 14న ఆదివాసి గిరిజన సంఘం, ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో ఐటిడిఏ ముందు ధర్నా. నిర్వహిస్తామిన గిరిజన సంఘాల నేతలు వెల్లడించారు. ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎల్ సుందర్రావు, ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడ రాధాకృష్ణ, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు జంపరంగి ఆనంద రాజ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చిన్నారావ్ లు గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, రెవెన్యూ అధికారులు అమ్ముడుపోయి నకిలీ బోగస్ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం దారుణమన్నారు. ఈ ధర్నాను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి- అరకులోయ: గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవడంతోనే సంపూర్ణ ఆరోగ్యం మెరుగు పడుతుందని సుంకరమెట్ట సిపిఎం సర్పంచ్ గెమ్మిలి చిన్నబాబు అన్నారు.సుంకరమెట్ట పంచాయతీలోని జడ్డిపనస అంగన్వాడి కేంద్రంలో ఐసిడిఎస్ సుంకరమెట్ట సెక్టార్ పరిధిలోని 20 అంగన్‌వాడి కేంద్రాలకు సంబంధించిన అంగన్వాడి టీచర్లు, గర్భిణులు, బాలింతలతో గురువారం నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.గర్భిణీలు, బాలింతలు, అంగన్వాడి కేంద్రాల ద్వారా ప్రభుత్వం ఇస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సుంకరమెట్ట పిహెచ్‌సి డాక్టర్ కిరణ్ మణి మాట్లాడుతూ, అనేక మంది బాలింతలు, గర్భిణీలు రక్తహీనతతో అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. ఆకుకూరలతో పాటు, పోషక విలువలతో కూడి ఉన్న పళ్ళు, పదార్థాలు కూడా తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అరకులోయ వైస్ ఎంపీపీ కొర్ర సుమంజలి, సుంకరమెట్ట సెక్టర్ సూపర్వైజర్ పార్వతి, అంగన్వాడి కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు రూరల్: ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పర్రేడలో పోషణ మహెూత్సవం నిర్వహించారు. సర్పంచ్ చెండా రవిశంకర మాట్లాడుతూ, గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడి కార్యకర్త కొండమ్మ, హెల్పర్ ఝాన్సీ పాల్గొన్నారు.

హుకుంపేట: శిశు మరణాల సంభవించకుండా గ్రామస్థాయిలో ఆశ వర్కర్లు బాధ్యత వహించి హాస్పటల్‌కు తరలించాలని వైద్యాధికారి ప్రశాంత్ బాబు సూచించారు. మండలంలోని పట్టాం పంచాయతీ బైరొడి వలస గ్రామంలో వైద్య శిబిరం గురువారం ఏర్పాటు చేశారు. ఆశావర్కర్లు గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య పరమైన పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రశాంత్ బాబు మాట్లాడుతూ, శిశు మరణాలు అరికట్టేందుకు ఆశ వర్కర్స్ లు వారానికి కనీసం రెండు రోజులు హెూమ్ విజిట్ చేయాలని సూచించారు. వ్యాక్సిన్ వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ఉమాదేవి, ఎంఎల్.హెచ్.పి వనజ పాల్గొన్నారు.

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సిడిపిఒ ఝాన్సీ

పాడేరు: పౌష్టికాహార కల్పనలో అంగన్వాడీ వర్కర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పాడేరు ఐసిడిఎస్ సిడిపిఓ ఝాన్సీ రాణి సూచించారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో గురువారం ప్రాజెక్టు స్థాయిలో పోషకాహార మాసోత్సవాలలో భాగంగా అంగన్వాడి వర్కర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా కార్యాలయంలో వివిధ రకాల పౌష్టికాహారాలతో ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల పరిధిలో గర్భిణీలు బాలింతలు చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం పంపిణీ చేయడంలో అత్యంత శ్రద్ధ వహించాలని ఆమె సూచించారు. గర్భిణీల ఆరోగ్యంతో పాటు తల్లి బిడ్డలు ఆరోగ్యంగా ఎదగడానికి పౌష్టికాహారం ఎంతో తోడ్పడుతుందని దీనిపై అంగన్వాడీలు వర్కర్లు తమ సెంటర్ల పరిధిలో లబ్ధిదారులందరికీ చైతన్య పరిచి ఆరోగ్యంగా వారి ఎదుగుదలకు కృషి చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు ఊర్మిళా రెడ్డి, రాజేశ్వరి, కవిత అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి- విఆర్.పురం

మండలంలో కొత్తగా మంజూరైన పింఛన్లను ఎంపీపీ కారం లక్ష్మి, రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని, పెద్ద మట్టపల్లి సర్పంచ్ వెట్టి లక్ష్మి చేతుల మీదుగా గురువారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, రేఖపల్లి సచివాలయం సెక్రటరీ శివప్రసాద్, రామారావు, పాల్గొన్నారు.

కూనవరం : మండలంలోని పెద్దర్కూర్ పంచాయితీలో కొత్తగా మంజూరైన పింఛన్లను స్థానిక ఎంపీటీసీ ధర్ముల అమ్మాజీ, సర్పంచ్ నాగమణి గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బాబు బొర్రయ్య, మడకం జోగయ్య, వైసీపీ నాయకులు ధర్ముల పిచ్చయ్య, ముత్తయ్య పాల్గొన్నారు.

రంపచోడవరం : మండలంలోని ముసురుమిల్లి సచివాలయంలో నూతనంగా మంజూరైన పింఛన్లను ఎంపీపీ బంధం శ్రీదేవి గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, ఎంపీటీసీ కొంచెం వంశీ, సర్పంచ్ కోసు రమేషబాబు, పండా రామకృష్ణ, డియల్‌పి జూన్ మిలీటన్, ఉప సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, వార్డ్ మెంబెర్లు రామలక్ష్మి, ప్రభావతి, బొబ్బా శేఖర్, పాల్గొన్నారు.

కొయ్యూరు : మండలంలోని కొండగోకరి సచివాలయం పరిధిలో నూతనంగా మంజూరైన పింఛన్లను పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి వారా నూకరాజు, రత్నంపేట సర్పంచ్ నూకరత్నం, కొండ గోకరి సర్పంచ్ ముసిలి నాయుడు, ట్రైకార్ డైరెక్టర్ సుమర్ల సరస్వతి, వైసిపి నాయకులు శేఖర్, కనపర్తి శ్రీను, రత్నంపేట శేఖర్, సూరిబాబు, గంగాధర్, ఇంకా రామరాజు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపిపి కారం లక్ష్మి తదితరులు

సీలేరు నదిలో అరుదైన చేపలు

అరుదైన దోబిజాతి చేపలు

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు నదిలో మత్స్యకారుల వలలకు గురువారం అరుదైన డోబిజాతికి చెందిన చేపలు చిక్కాయి. ఒక్కొక్క చేప పది నుంచి 16 కిలోల వరకు బరువు కలిగి ఉన్నాయి. మత్స్యకారులు ప్రతిరోజు సీలేరు నదిలో చేపల వేట కొనసాగిస్తారు. ఇదే తరహాలో గురువారం ఉదయం వేటకి వెళ్లగా దోబిజాతికి చెందిన చేపలు లభ్యం కావడంతో మత్స్యకారుల్లో ఎనలేని సంతోషం వ్యక్తమైంది.

ఇటీవల ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో కొండలు కోనలు నుంచి మట్టి రంగును కలిగిన బురద నీరు సీలేరు నదిలో చేరింది. దీంతో నదిలో చేరిన వ్యర్థపదార్థం తినేందుకు చేపలు ఎగబడుతుండడంతో అవి వలలకు చిక్కుతున్నాయి.

రెండో రోజుకు టిడిపి నిరాహార దీక్ష

ప్రజాశక్తి-రంపచోడవరం : తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టిడిపి నాయకులు స్థానిక టిడిపి క్యాంప్ కార్యాలయం వద్ద రెండో రోజు రిలే నిరాహార దీక్షలను కొనసాగించారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి వంతల రాజేశ్వరి, నియోజకవర్గ పరిశీలకులు యర్రా వేణుగోపాల్ రాయుడు, మాజీ ఎమ్మెల్యేలు సీతంశెట్టి వెంకటేశ్వర రావు, చిన్నం బాబురమేష్ మాట్లాడుతూ తమ అధినేత కోసం మేము శాంతియుతంగా నిరసనలు చేస్తుంటే ఆంక్షలు విధిస్తూ అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు. **చింతూరు :** చింతూరు మండల కేంద్రంలో టిడిపి నాయకులు ఓ.రామారావు చౌదరి, పోడియం అప్పారావు ఆధ్వర్యాన రిలే నిరాహార దీక్షలు రెండో రోజు కొనసాగాయి. దీనికి జనసేన నాయకులు మడివి రాజు, పయ్యాల నాగేశ్వరరావు మద్దతు తెలిపారు.

కార్యక్రమంలో నాయకులు ఇళ్ల చిన్నారెడ్డి, మల్లెల వెంకటేశ్వర్లు, గడ్డం సురేష్, శీలం తమ్మయ్య, పొదిలి రామారావు, శ్రీరామ్మూర్తి రెడ్డి, ముత్యాల శ్రీరామ్, ఓబులేని నరసింహారావు, కె.బాలకృష్ణ, మిడియం కొండయ్య, కె.చిన్నమత్తయ్య, అనిగి చంద్రయ్య, పసుపులేటి సల్మాన్ రాజు, జనసేన నాయకులు తీగల రవి, కన్నారావు, దుర్గారావు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గంజాయి తోటల ధ్వంసం

ప్రజాశక్తి -హుకుంపేట: గంజాయి సాగు చట్ట రీత్యా నేరమని స్థానిక ఎస్సై బి.సతీష్ అన్నారు. మండలంలోని తీగలవలస, మత్స్య పురం, గన్నేరు పుట్టు పంచాయతీల్లో గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు. ఐదుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్కు పంపించినట్లు ఎస్సై గురువారం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో శ్రీ ప్రకాష్ విద్యార్థి మృతి

ప్రజాశక్తి -పాయకరావుపేట: రోడ్డు ప్రమాదంలో పాయకరావుపేట వీవర్స్ కోలనీకి చెందిన శ్రీ ప్రకాష్ పాఠశాల విద్యార్థిని మృతి చెందినట్లు ఎస్సై జోగారావు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. పాయకరావుపేట గ్రామానికి చెందిన పిన్నింటి సురేష్‌కుమార్ తన కుమార్తె పిన్నింటి హరిణిని గురువారం పాఠశాలకు బైక్‌పై తీసుకెళ్తుండగా శ్రీ ప్రకాష్ జంక్షన్ దగ్గరలో తుని నుండి నామవరం వెళుతున్న లారీ ఢీకొంది. హరిణి లారీ టైర్ కింద పడటంతో తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది.

మాట్లాడుతున్న కలెక్టర్

ఇంటింటి సర్వేలో 40 వేల ఓటర్లు తొలగింపు

- కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: ఇంటింటి సర్వేతో సుమారు 40 వేల మరణించిన, నకిలీ ఓటర్లను తొలగించడం జరిగిందని, వాటిపై అభ్యంతరాలను లిఖిత పూర్వకంగా తెలియజేయాలని, వాటిని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. కలెక్టరేట్లో గురువారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్త ఓటర్లను గుర్తించి నమోదు చేయడం, మరణించిన, నకిలీ ఓటర్లు (డూప్లికేట్స్, డబుల్ ఎంట్రీలు) తొలగింపు ప్రాధాన్యతగా ఇంటింటి సర్వే నిర్వహించామని వివరించారు. పివిటిజి ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. 2.30 లక్షల మంది పివిటిజి ఓటర్లు ఉండగా 1.30 లక్షల మంది మాత్రమె నమోదయ్యారని, మిగిలిన లక్ష మందిలో 80 వేల మందిని నూతనముగా ఓటరు జాబితాలో చేర్చటం జరిగిందని కలెక్టర్ వివరించారు. వంద సంవత్సరాల పైబడి వయసు గల వారు 66 మంది ఉన్నారని, వారిని గుర్తించి చనిపోయినవారిని తొలగించటం, మిగిలిన వారి వయసు నిర్ధారించి సరి చేయటం జరిగిందని తెలిపారు. అదనంగా పోలింగ్ బూత్ లు ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందని, రాజకీయ పార్టీల నుండి ప్రతిపాదనలు పంపిస్తే పరిశీలించి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో పది వేల ఫిర్యాదులు అందాయని వాటిలో ఏడు వేల ఓటర్లను పరిశీలించి తొలగించడం జరిగిందని, ఇంకా 2,300 ఫిర్యాదులు పరిశీలించి చర్యలు తీసుకోవలసి ఉందని కలెక్టర్ వివరించారు. అన్ని రాజకీయ పార్టీలు వారి తరుపున బూత్ లెవల్ ఏజంట్లను నియమించుకోవాలని సూచించారు.

తెలుగుదేశం పార్టీ ప్రతినిధి, మాజీ శాశనసభ్యులు గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ, తమ పార్టీ తరుపున బూత్ లెవల్ ఏజంట్లను నియమించటం జరిగిందని, బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటినీ సర్వే చేయటం లేదని, అడిగితె దురుసుగా స్పందిస్తున్నారని, కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. కలెక్టర్ స్పందిస్తూ అటువంటి వారిపై ఫిర్యాదు అందిస్తే తగు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి పి. అంబేద్కర్, వైఎస్ఆర్సిపి తరుపున ఎస్.రాంబాబు, బిజెపి తరుపున కే..రాఘవేంద్రరావు, సిపిఐ వి.జ్యోతి అమర్నాథ్, సిపిఎం దూరు బొజ్జన్న, బిఎస్పి పండన్న పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - అడ్డతీగల : మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కాకినాడలో జరిగిన కుస్తీ పోటీల్లో 48 కేజీల విభాగంలో 8వ తరగతి చదువుతున్న కుంజం వెంకన్న దొర, 55 కేజీల విభాగంలో 9వ తరగతి చదువుతున్న పిట్ట నిఖిల్ రెడ్డి ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు కె.వరప్రసాద్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, పిఈటి మల్లేశ్వరరావు అభినందించారు.

యుటిలిటీస్ యూనిట్లను ఉక్కు యాజమాన్యమే నడపాలి

ప్రజాశక్తి - ఉక్కునగరం : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో యుటిలిటీస్ విభాగంలో ఎఎస్‌పి 7, 8 యూనిట్లను స్టీల్‌ప్లాంట్ యాజమాన్యమే నడపాలని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. సమస్యపై గురువారం స్టీల్ సిఐటియు తన మిత్రపక్షాలతో కలిసి స్టీల్ యుటిలిటీస్ విభాగం కార్యాలయం వద్ద ధర్నా చేపట్టింది. పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొని యాజమాన్యానికి వ్యతిరేకంగా నినదించారు. ఈ ధర్నానుద్దేశించి అయోధ్యరామ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో స్థానిక స్టీల్ యాజమాన్యం విభాగాల వారీగా ప్రైవేట్‌కు అమ్మాలని ప్రయత్నిస్తే తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. గతంలో స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపించిన ఘనత అధికారులతో పాటు కార్మిక వర్గానికి ఉందని, దీన్ని అపహాస్యం చేయాలని చూస్తే వారిని ఉపేక్షించబోమని అన్నారు. ప్రస్తుత ప్రయత్నాలను తక్షణం ప్లాంట్ యాజమాన్యం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ స్థానిక స్టీల్ యాజమాన్యానికి గుర్తింపు యూనియన్ సాగిలపడి అడుగులకు మడుగులొత్తుతోందని విమర్శించారు. ఉద్యమానికి సంఘీభావంగా విచ్చేసిన మిగిలిన కార్మిక సంఘాలను అభినందించారు. సంఘం అధ్యక్షులు వైటి.దాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు మిత్రపక్షాల ప్రతినిధులు డివి.రమణారెడ్డి, డి.సురేష్ బాబు, సిహెచ్.సన్యాసిరావు మాట్లాడారు. కార్మిక సంఘాల ప్రతినిధులు దాలినాయుడు, వరసాల శ్రీనివాస్, బొడ్డు రమణ, పరంధామయ్య, స్టీల్ సిఐటియు ఒప్పంద కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ ధర్నాకు మద్దతు తెలిపారు. అనంతరం విభాగాధిపతి ఎన్ఆర్.రవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పి.శ్రీనివాసరాజు, బి.అప్పారావు, కె.గంగాధర్, యు.వెంకటేశ్వర్లు, పుల్లారావు, కెవి.సత్యనారాయణ, బి.మహేష్, మిత్రపక్షాల ప్రతినిధులు శంకరరావు, ప్రకాష్‌రావు, యుటిలిటీస్ విభాగం ప్రతినిధులు రమణమూర్తి, ఎస్.సత్యనారాయణ, ఎ.కనకరాజు, వెంకటలక్ష్మి, చంద్రశేఖర్, త్రినాధ్, స్టీల్ సిఐటియు ఒప్పంద కార్మిక సంఘం అధ్యక్షులు జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేటి నుండి వైశాఖి నృత్యోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 17 వరకూ తలపెట్టిన వైశాఖి నృత్యోత్సవ సంబరాలు శుక్రవారం ప్రారంభంకానున్నాయి. ఈ సందర్భంగా ఫెస్టివల్ డైరెక్టర్ బిఆర్.విక్రమ్ కుమార్ (గౌడ్) తాము అందించే పురస్కార వివరాలను ప్రకటించారు. క్లాసికల్ మాస్ట్రోగా అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన కూచిపూడి, జానపద నాట్య నిపుణులు, కొరియోగ్రాఫర్ కళారత్న కెవి.సత్యనారాయణను వైశాఖీ జీవన సాఫల్య పురస్కారంతో సత్కరించనున్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుండి కూచిపూడి నాట్యంలో పిహెచ్‌డి పట్టా పొందిన డాక్టర్ కాజా వెంకట సుబ్రహ్మణ్యంను వైశాఖీ ఎక్సెలెన్స్ అవార్డు-2023తో ప్రశంసించనున్నారు.